డ్యాన్సింగ్ వార్

'దేవర' హడావిడి ప్రస్తుతానికి ముగిసింది. ఇప్పుడు తారక్ దృష్టి అంతా 'వార్ 2' మీదే. అందుకే.. లుక్ మార్చేశాడు. రీసెంట్‌గా 'వార్ 2'కోసం ముంబై ఫ్లయిట్ ఎక్కేశాడు. ఈ కొత్త షెడ్యూల్‌లో హృతిక్, తారక్‌లపై ఓ పాటను దర్శకుడు అయాన్ ముఖర్జీ తెరకెక్కించనున్నారట. హృతిక్, తారక్ ఇద్దరూ గొప్ప డ్యాన్సర్సే. అందుకే.. అబ్బురపరిచే డ్యాన్స్ మూమెంట్స్‌తో ఈ పాటను డిజైన్ చేశారట. ప్రస్తుతం ముంబైలో ఈ పాట షూటింగ్ జరుగుతున్నది. డ్యాన్స్ లవర్స్ పండుగ చేసుకునేలా ఈ పాట ఉండబోతున్నదని టాక్. ఇప్పటికే తారక్, హృతిక్‌లపై భారీ యాక్షన్ ఎపిసోడ్స్‌ని కూడా పూర్తి చేశారు. ఓ వైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. వచ్చే ఏడాది ఆగస్ట్ 14న సినిమాను విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇదిలావుంటే.. ఈ సినిమా తెలుగు వెర్షన్‌కు 'యుద్ధభూమి' అనే టైటిల్ అనుకుంటున్నట్టు తాజా సమాచారం. పాన్ ఇండియా సినిమాలు ఒకే టైటిల్‌తో అన్ని భాషల్లో విడుదల అవుతున్న రోజులివి. అయితే.. తారక్‌ది ఇందులో వన్ ఆఫ్ ది లీడ్ రోల్ కాబట్టి, ఆయన్ను దృష్టిలో పెట్టుకొని తెలుగు టైటిల్ పెట్టాలని మేకర్స్ భావిస్తున్నారనేది బీటౌన్ టాక్. నిజానికి 'యుద్ధభూమి' ఇక్కడ కొత్త టైటిలేం కాదు. గతంలో చిరంజీవి హీరోగా ఇదే పేరుతో ఓ సినిమా వచ్చింది. 'వార్ 2' అనేది కూడా యూనివర్సల్ టైటిల్. ఫైనల్‌గా అదే ఖరారయ్యే అవకాశం కూడా లేకపోలేదు.

స్త్రీ 3 ఆగమనం ఘరూ..

' 'స్త్రీ' బాగా ఆడింది. నిర్మాతలకు డబ్బులు, పనిచేసిన వారికి పేరు తెచ్చిపెట్టింది. మొదట్లో ఈ సినిమాకు సీక్వెల్ చేయాలన్న ఆలోచన లేదు. ఆ ఊహ కూడా ఎవరికీ రాలేదు. ఓరోజు దర్శకుడు అమర్ కౌశిక్ 'స్త్రీ 2' కథ చెప్పాడు. కాసేపు షాక్‌లో ఉండిపోయా. తను ఇంత కొత్తగా ఎలా ఆలోచించాడా?! అనిపించింది. అయితే.. ఇంతటి సక్సెస్ మాత్రం ఊహించలేదు. అసలు ఓ హారర్ కామెడీ సినిమాకు 900కోట్లు రావడమేంటి? బాలీవుడ్‌లో ఎవరికీ మింగుడుపడని విజయం ఇది.' అంటూ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది బాలీవుడ్ భామ శ్రద్ధాకపూర్. ఇంకా ఆమె మట్లాడుతూ ' 'స్త్రీ 2' విజయం మా టీమ్ అందరికీ సొంతం. స్క్రిప్ట్ బావుంటే కాస్టింగ్‌ను కూడా ప్రేక్షకులకు పట్టించుకోరని 'స్త్రీ 2' రుజువు చేసింది. మూడో పార్ట్‌లో ఎంటర్టైన్మెంట్ ఇంతకుమించి ఉంటుంది. పనులు కూడా మొదలయ్యాయి. చాలా డెవలప్‌మెంట్లు జరిగాయి కూడా.' అంటూ 'స్త్రీ 3'కు సంబంధించిన అప్‌డేట్‌ని ఆడియన్స్‌కి అందించింది శ్రద్ధాకపూర్.

కేసీఆర్ అభిమాని కథ

బంజారా వర్గానికి చెందిన ఓ యువకుడి జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం 'కేశవ చంద్ర రమావత్'(కేసీఆర్). 'జబర్దస్త్'ఫేం రాకేష్ హీరోగా నటించి, స్వయంగా నిర్మించిన ఈ చిత్రానికి గరుడవేగ అంజి దర్శకుడు. అనన్య కృష్ణన్ కథానాయిక. శనివారం హైదరాబాద్‌లో ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ని విడుదల చేశారు. కేశవచంద్ర రమావత్(కేసీఆర్), అతని మరదలు మధ్య చిన్ననాటి స్నేహాన్ని ఆవిష్కరిస్తూ ఈ ట్రైలర్ సాగింది. తెలంగాణ సాధకుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నుంచి స్ఫూర్తి పొందిన యువకుడు కేశవచంద్ర రమావత్‌గా రాకేష్ నటించాడు. 'నా షార్ట్‌నేమ్ కేసీఆర్' అని కేశవచంద్ర రమావత్ సగర్వంగా చెప్పుకుంటూ ఉంటాడు. తన ఊరు మేలు కోరుతూ ఓ లక్ష్యంతో హైదరాబాద్‌కు బయలుదేరిన కేసీఆర్ ఆ లక్ష్యాన్ని ఎలా సాధించాడనేది ఈ సినిమా కథ అని మేకర్స్ తెలిపారు. 'ఈ సినిమాకు కథకుడు కూడా రాకేషే. అద్భుతమైన కథ రాశాడు. కథ వినగానే చేస్తానని చెప్పాను. సినిమాటోగ్రఫీ కూడా నేనే చేశాను. ఈ సినిమాకు పనిచేసిన వారంతా ప్రాణంపెట్టి పనిచేశారు' అని దర్శకుడు చెప్పారు. ఇంకా ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన దర్శకుడు సాయిరాజేష్, నటుడు శివబాలాజీ, నటి అనసూయ , నటుడు శివారెడ్డి చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు అందించారు.

తెలంగాణ యాసలో డైలాగ్స్ చెప్పాను

''**విక్రమార్కుడు'** చిత్రంలో టిట్లా పాత్రలో నేను పండించిన విలనీ అందరికి గుర్తుండిపోయింది. ఆ తర్వాత ఆ స్థాయి క్యారెక్టర్ రాలేదు. ఇప్పుడా లోటుని 'పొట్టేల్' సినిమా తీర్చింది' అన్నారు అజయ్. యువచంద్రకృష్ణ, అనన్య నాగళ్ల జంటగా సాహిత్ మోత్కూర్ దర్శకత్వం వహించిన 'పొట్టేల్' చిత్రం ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా నటుడు అజయ్ మాట్లాడుతూ ' తెలంగాణ నేపథ్యంలో 1980 దశకంలో కథ నడుస్తుంది. అప్పటి గ్రామీణ తెలంగాణలోని మూఢనమ్మకాలు, సెంటిమెంట్స్.. ఈ క్రమంలో పండే డ్రామా ఉద్వేగాన్ని పంచుంది. అంతర్లీనంగా చదువు అవశ్యకత గురించి చర్చిస్తుంది' అన్నారు. తాను ఇంటర్‌మీడియట్ నుంచి హైదరాబాద్‌లోనే ఉండటం వల్ల తెలంగాణ యాసలో సంభాషణలు చెప్పడం అంత కష్టమేమీ కాలేదని అజయ్ తెలిపారు. పటేల్ క్యారెక్టర్ కోసం చేసిన హోమ్‌వర్క్ గురించి చెబుతూ 'తెలంగాణలో సిగం (పూనకం) వచ్చిన వాళ్లు మాట్లాడే విధానం వేరుగా ఉంటుంది. సినిమాలోని ఆ ఎపిసోడ్ కోసం ప్రత్యేకంగా దృష్టి పెట్టాను. దేవుడి వేడుకల్లో పూనకం వచ్చే వాళ్లను కలిసి కొన్ని విషయాలు తెలుసుకున్నా' అన్నారు. ప్రస్తుతం చేస్తున్న సినిమాల గురించి చెబుతూ ''పుష్ప-2'లో మంచి పాత్ర చేస్తున్నా. అజయ్‌దేవ్‌గణ్ 'సింగం ఎగైన్'లో నటిస్తున్నా. తమిళం, మలయాళంలో కొన్ని సినిమాలను అంగీకరించా' అన్నారు.

ఉద్వేగపూరితంగా జాత్

బాలీవుడ్ స్టార్ సన్నీడియోల్ కథానాయకుడిగా టాలీవుడ్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతోన్న భారీ పాన్ ఇండియా చిత్రానికి 'జాత్' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. మైత్రీ మూవీమేకర్స్ అధినేతలు నవీన్ యర్నేని, వై.రవిశంకర్.. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వప్రసాద్ కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇది సన్నీడియోల్ వందవ చిత్రం కావడం విశేషం. సన్నీడియోల్ రీసెంట్ హిట్ 'గద్దర్ 2' 60 కోట్ల బడ్జెట్‌తో రూపొంది, దాదాపుగా 700కోట్ల వసూళ్లను రాబట్టి భారీ విజయాన్ని నమోదు చేసింది. 'గద్దర్ 2' తర్వాత వస్తున్న సన్నీడియోల్ సినిమా కావడంతో ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. సన్నీడియోల్ పుట్టినరోజు సందర్భంగా శనివారం మేకర్స్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో సన్నీడియోల్ పవర్‌ఫుల్‌గా, ఉద్వేగపూరితమైన రూపంలో కనిపిస్తున్నారు. శరీరమంతా రక్తపు మరకలతో ఓ పెద్ద ఫ్యాన్‌ని పట్టుకొని ఉన్న ఈ పోస్టర్ మాస్ ప్రేక్షకులకు నచ్చేలా ఉంది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్నది. రణదీప్ హుడా, వినీత్ కుమార్‌సింగ్, సయామి ఖేర్, రెజీనా కసాండ్రా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రిషి పంజాబి, సంగీతం: ఎస్.థమన్,

మట్కాలో సాహుగా



మెగా హీరో వరుణ్‌తేజ్ నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'మట్కా' విడుదలకు సిద్ధమవుతున్నది. కరుణకుమార్ దర్శకుడు. డాక్టర్ విజయేందర్‌రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మాతలు. నవంబర్ 14న సినిమా విడుదలకానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రచారంలో జోరు పెంచారు. ఈ మూవీలో నవీన్‌చంద్ర సాహూగా ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ఆయన పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్‌ని శనివారం విడుదల చేశారు. స్కూటర్‌పై కూర్చుని సీరియస్‌గా చూస్తున్న నవీన్‌చంద్రను ఈ పోస్టర్‌లో చూడొచ్చు. వరుణ్‌తేజ్ కెరీర్‌లోనే అత్యంతభారీగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి కథానాయికలు. అజయ్‌ఘోష్, కన్నడ కిశోర్, రవీంద్రవిజయ్, పి.రవిశంకర్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఎ.కిశోర్‌కుమార్, సంగీతం: జి.వి.ప్రకాశ్‌కుమార్.

యూనివర్సల్ కాన్సెప్ట్ 'నరుడి బ్రతుకు నటన'

శివకుమార్ రామచంద్రవరపు, నితిన్ ప్రసన్న ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'నరుడి బ్రతుకు నటన'. రిషికేశ్వర్ యోగి దర్శకుడు. టీజీ విశ్వప్రసాద్, సుకుమార్ బోరెడ్డి, డా॥ సింధు రెడ్డి నిర్మాతలు. ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. శనివారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ వేడుకకు హీరో సుధీర్‌బాబు, దర్శకుడు వీరశంకర్, వీజే సన్నీ, శ్రీరామ్ ఆదిత్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మంచి కాన్సెప్ట్‌తో తీసిన ఈ సినిమాను ప్రేక్షకులందరూ ఆదరించాలని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ కోరారు. మానవ సంబంధాల లోతుల్ని తరచి చూపించే ఈ కథ ప్రతి ఒక్కరికీ నచ్చుతుందని దర్శకుడు రిషికేశ్వర్ యోగి తెలిపారు. జాతీయ అవార్డు అందుకునే కంటెంట్ ఉన్న సినిమా ఇదని, యూనివర్సల్ అప్పీల్ ఉన్న కథతో ఆకట్టుకుంటుందని ప్రధాన పాత్రధారులు శివకుమార్, నితిన్ ప్రసన్న పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

మన ఇంటి లగ్గం యాదికొస్తుంది

'భీమదేవరపల్లి బ్రాంచి' చిత్రం ద్వారా ప్రతిభావంతుడైన దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు రమేష్ చెప్పాల. తెలంగాణ నేపథ్య కథాంశంతో ఆయన తెరకెక్కించిన తాజా చిత్రం 'లగ్గం' ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. సుబిషి ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై వేణుగోపాల రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా దర్శకుడు రమేష్ చెప్పాల 'నమస్తే తెలంగాణ'తో చిత్ర విశేషాలను పంచుకున్నారు.

- తెలంగాణ సంస్కృతిలో లగ్గం చాలా ప్రత్యేకతలతో కూడుకొని ఉంటుంది. పెళ్లి చుట్టూ అల్లుకున్న భావోద్వేగాలు, సరదా సంగతులను అందమైన దృశ్యరూపంగా తెరపై తీసుకురావాలనే ఉద్దేశ్యంతో ఈ సినిమా తీశా. చిన్నతనం నుంచి నేను చూసిన వ్యక్తులు, ఎదుర్కొన్న అనుభవాలతో ఈ కథ రాశాను. 'లగ్గం' అనే టైటిల్ అనుకోగానే అద్భుతమైన స్పందన లభించింది.
- బావామరదళ్ల పెళ్లి నేపథ్యంలో కథ నడుస్తుంది. తన కూతురుని సాఫ్ట్‌వేర్ అబ్బాయికి ఇచ్చి పెళ్లి చేస్తే బాగుంటుందని తపించే తండ్రి చివరకు ఏ నిర్ణయం తీసుకున్నాడనేది కథలో ఆసక్తికరంగా ఉంటుంది. పెళ్లిహూపులు మొదలుకొని అప్పగింతల వరకు తెలంగాణ లగ్గంలో జరిగే ఎన్నో మధుర ఘట్టాలను ఆవిష్కరిస్తూ పొయిటిక్ ఫీల్‌తో ఈ సినిమా సాగుతుంది. ప్రతీ ఆడపిల్ల తండ్రి తప్పక చూడాల్సిన సినిమా ఇది.
- క్లైమాక్స్ ఘట్టాలు హృదయాన్ని స్పృశించే భావోద్వేగాలతో సాగుతాయి. ప్రేక్షకులకు గొప్ప సత్యాన్ని తెలియజేస్తూ కథ ముగుస్తుంది. మన ఇంట్లో జరిగిన లగ్గాన్ని యాదికి తెస్తూ ఎన్నో అందమైన జ్ఞాపకాలను గుర్తుకు తెస్తుంది. ఈ లగ్గానికి విచ్చేసే ప్రేక్షకులందరూ నా బంధువులే. అందరూ సినిమాకు విచ్చేసి మీ ఆశీస్సులు అందించాలని కోరుకుంటున్నా

సీన్ రివర్స్ అయ్యింది

సినిమా వేడుకల్లో సాయిపల్లవి కనిపిస్తే, జనానికి వేరే సెలబ్రిటీలతో పనుండదు. ఆ వేడుక అంతా సాయిపల్లవి మేనియాతో నిండిపోవాల్సిందే. ఆడియన్స్‌కే కాదు, వేదికపై ఉండే సెలబ్రిటీలకు కూడా సాయిపల్లవి జపమే. ప్రస్తుతం ఆమె దశ అలా ఉంది. శివకార్తికేయన్ హీరోగా నటించిన 'అమరన్' సినిమా ఈ నెల 31న విడుదల కానుంది. ఈ సందర్భంగా చెన్నయ్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ వేడుకలో సాయిపల్లవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వేదికపై ఆమె కనిపించగానే, తమిళ జనాలకు పూనకాలు వచ్చేశాయి. పైగా, హీరో శివకార్తికేయన్ నుంచి అతిథిగా విచ్చేసిన లెజెండ్రీ డైరెక్టర్ మణిరత్నం వరకూ సాయిపల్లవిని పొగడ్తలతో ముంచెత్తారు. మణిరత్నం అయితే.. ఒకడుగు ముందుకేసి, 'నేను సాయిపల్లవి అభిమానిని. ఆమెతో సినిమా చేయాలనుంది. తప్పకుండా చేస్తా..' అని వేలాది జనాల సాక్షిగా చెప్పేశారు. సాధారణంగా మణిరత్నం దర్శకత్వంలో నటించాలని హీరోయిన్లందరూ కలలు కంటుంటారు. కానీ ఇక్కడ సీన్ రివర్స్ అయ్యింది. ఇక 'అమరన్' సినిమా విషయానికొస్తే.. ఆర్మీ అధికారి మేజర్ ముకుంద్ వరదరాజన్ బయోపిక్‌గా ఈ సినిమా రూపొందింది. ఇందులో ముకుంద్ వరదరాజన్‌గా శివకార్తికేయన్ నటించగా, కథలో కీలకమైన ఆయన భార్య పాత్రను సాయిపల్లవి పోషించింది.

భక్తి ప్రధానంగా దుర్గమ్మ

చిన్న, మధుప్రియ, రుచిక ప్రధానపాత్రధారులుగా రూపొందుతోన్న చిత్రం 'జై జై దుర్గమ్మ'. సుభాని దర్శకుడు. ఎం.అనిత నిర్మాత. త్వరలో సినిమా విడుదల కానుంది. శనివారం హైదరాబాద్‌లో ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ కార్యక్రమం జరిగింది. అతిథులుగా విచ్చేసిన నిర్మాత సాయివెంకట్, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణగౌడ్ ట్రైలర్‌ని విడుదల చేయగా, మరో అతిథి వి.సముద్ర చిత్ర లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అతిథులందరూ చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. ఎక్కడా రాజీ పడకుండా ఈ సినిమా నిర్మించామని, భక్తి ప్రధానంగా సినిమా సాగుతుందని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: నందన్‌కృష్ణ, సంగీతం: జయసూర్య, నిర్మాణం: ANI క్రియేషన్స్

అంచనాలు నిజమయ్యాయి

అంజన్ రామచంద్ర, శ్రావణి రెడ్డి జంటగా నటించిన చిత్రం 'లవ్ రెడ్డి'. స్మరణ్ రెడ్డి నిర్మాత. ఇటీవలే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా శనివారం సక్సెస్‌మీట్‌ను నిర్వహించారు. దర్శకుడు మాట్లాడుతూ 'యథార్థ ఘటనల ఆధారంగా స్వచ్ఛమైన ప్రేమకథతో ఈ చిత్రాన్ని రూపొందించాం. అన్ని కేంద్రాల్లో మంచి స్పందన లభిస్తున్నది. ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీతో పాటు సినిమాలోని కామెడీ అందరిని ఆకట్టుకుంటున్నది' అన్నారు. ఎమోషనల్ లవ్‌స్టోరీగా ప్రేక్షకుల్ని మెప్పిస్తున్నదని, ఈ సినిమా విషయంలో తమ అంచనాలు మొత్తం నిజమయ్యాయని నిర్మాత మదన్ గోపాల్ రెడ్డి చెప్పారు. విభిన్న కథాంశంతో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకాదరణ సొంతం చేసుకోవడం ఆనందంగా ఉందని నాయకానాయికలు అంజన్ రామచంద్ర, శ్రావణి రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.